సేవలకు చంద్రగ్రహణం

- వెలవెలబోతున్న సచివాలయాలు
- ఏడాది దాటినా అందని సేవలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వం


అముజూరు గ్రామ సచివాలయం

కె.గంగవరం: గ్రామాల అభివృద్ధే దేశానికి వెన్నుముఖ అని జాతిపిత గాంధీజీ అనేక సందర్భాల్లో తెలిపారు. ఇందుకు అణుగుణంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను రూపొందించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు సర్కారు కొలువు అందించారు. పంచాయతీ స్థాయిలో రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన ప్రతి పనీ స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయ వ్యవస్థ అనతికాలంలో విజయవంతమైయింది. వలంటీర్ల సహకారంతో అర్హులకు ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందేవి. అయితే ఇదంతా గతం.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారలోనికి వచ్చిన తరువాత సంక్షేమానికి తిలోదకాలు ఇచ్చి అనసరమైన విషయాలను తెరపైకి తెచ్చి అసమర్థపాలన చేస్తోంది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. సచివాలయాల్లో అందే సేవల్లోనూ కోత విధించింది. నిత్యం సందడిగా ఉండే సచివాయాలను గత ఏడాదిగా బోసిపోయాయి.

తెరచుకోని వెబ్‌సైట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచీ సచివాలయాల వైభవం తగ్గిపోయింది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థ కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అందించే సేవలను తగ్గించుకుంటూ పోతున్నారు. కులం, ఆదాయం, వన్‌బీ ఇతర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీ, తదితర వెబ్‌సైట్లు గత ఏడాదిగా ఓపెన్ కావడం లేదు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 26 గ్రామాలకు గాను 18 సచివాలయాలు, రామచంద్రపురం రూరల్‌లో 26 గ్రామాలకు గాను 19 సచివాలయాలు, కపిలేశ్వరపురం మండలంలో 19 గ్రామాలకు గాను సచివాలయాలు 20 సచివాలయాలు, రాయవరం మండలంలో 12 గ్రామాలకు గాను 19 సచివాలయాలు, కాజులూరు మండలంలోని 26 గ్రామాలను గాను 19 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 1300 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. కూటమి నాయకులు నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు చేశారు. నేడు కూటమి ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగులే దిక్కుగా మారారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీలో కీలకంగా ఉన్నారు.

ఎన్నో ప్రయోజనాలు

నాడు ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చారు. దీనికి అనుసంధానంగా వలంటీర్లను నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ వారి ఇళ్ల వద్దనే సేవలందించేలా చూశారు. సచివాలయాల్లో దాదాపు 545 రకాల సేవలను అందుబాటులోనికి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ప్రజలందరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు. రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లో నిర్వహించేలా వాటి స్థాయిని పెంచారు.

సేవలందక ఇబ్బంది



సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు గతంలో మాదిరిగానే అందించాలి. ప్రస్తుతం సచివాలయాల్లో పూర్తి స్థాయిలో పౌరసేవలు అందించడం లేదు. ఇబ్బంది పడుతున్నాం. సచివాలయ ఉద్యోగుల్ని కూడా వలంటీర్లగా కూటమి ప్రభుత్వం మార్చే ప్రయత్నిం చేస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సచివాలయల వ్యవస్థ పేరును నిలబెట్టేలా ప్రయత్నాలు మొదలు పెట్టాలి.

– బత్తుల అప్పారావు, కుందూరు

ప్రభుత్వం తీరు సరికాదు



రేషన్, పింఛన్ కార్డులు, ఆరోగ్య శ్రీ ఇతర అవసరాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం విధివిధానాలను రూపొందించి వెబ్‌సైట్లను అందుబాటులోనికి తీసుకురావాలి. వ్యవస్థలను మరింత మెరుగుపరిచి నడిపిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. అంతే తప్ప గత ప్రభుత్వంపై కక్షతో వారికి పేరు వస్తుందన్న నెపంతో సచివాయాలను నిర్వీర్యం చేసేలా అడుగులు వేయడం సరికాదు.

– వట్టికూటి శేఖర్,
మాజీ ఎంపీపీ కె.గంగవరం

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం


సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్న పీఆర్‌టీయూ సంఘ నాయకులు, సభ్యులు

కె.గంగవరం: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ అన్నారు. మండల పరిధిలోని సత్యవాడ, దంగేరు, శివల, భట్లపాలిక, మసకపల్లి, అద్దంపల్లి, బాలాంత్రం, యర్రపోతవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సంఘ సభ్యులతో కలసి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించామన్నారు. కానీ ఎన్నికల్లో గెలిచి ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు సమస్యలు పరిష్కరించకపోగ కనీసం ఒక్క డీఏ కూడా విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే డీఏను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఉపాధ్యాయులపూ పరీక్షల పేరుతో పెడుతున్న ఒత్తిడిని తగ్గించి బోధనపై సమయం ఎక్కువ కేటాయించేలా చూడాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఏఓ రమణ, మండల గౌరవ అధ్యక్షులు డి.లోవరాజు, మండల అసోషియేషన్ అధ్యక్షులు షేక్ నేషద్, ప్రధాన కార్యదర్శి డీవీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆశయాలు యువతకు ఆదర్శం


దుగ్గుదుర్రులో వివేకానందుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కాజులూరు: స్వామి వివేకానంద ఆశయాలు యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత, ఉప్పుమిల్లి గ్రామ సర్పంచ్ పెంకే సత్తిబాబు అన్నారు. ప్రపంచ సోదర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దుగ్గుదుర్రు పీహెచ్‌సీ ఆవరణలో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్తిబాబు తదితర నాయకులు పాల్గొని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనానికి భారతదేశం నుంచి ప్రతినిదిగా వెళ్లిన వివేకానందుడు «సోదరి సోదరీమణులారా» అంటూ తన ప్రశంగాన్ని ప్రారంభించి భారతదేశం సంస్కృతి, ఆధ్యాత్మిక విధాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులను పంచిపెట్టారు. కార్యక్రమంలో పూజ్యం నాగేశ్వర శర్మ, స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గుబ్బల అప్పారావు, అయినాల సతీష్, జి.శైలజా, ఉపేంద్ర, రాజబాబు, శ్రీనివాసు, కడలి ప్రసాద్, రజకసంఘం నాయకుడు కురవాడ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి


కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఈశ్వరరావు తదితరులు

కాజులూరు: గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వేతన బకాయులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం కోలంకలో కార్మిక సంఘం నాయకుడు కె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో భాగంగా వేతనాలు కనీసం 15 రోజులకు ఒకసారైనా చెల్లించాల్సి ఉందని ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఎక్కడ అది అమలు జరగడం లేదన్నారు. పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఏమి తిని బతుకుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతన బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో సంఘం ద్వారా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పంపన ప్రసాద్ చింతపల్లి భరీల్లమ్మ, గుత్తుల రాముడు, కొడగల అన్నవరం, దొంగా సుబ్బారావు, కాదా కొండ తదితరులు పాల్గొన్నారు.

అనవసర యాప్‌లు తొలగించాలి

నిరసన వ్యక్తం చేసిన సచివాలయ ఉద్యోగులు


ఎంపీడీవో కీర్తిస్పందనకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రాయవరం: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అస్తవ్యస్త నిర్ణయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అనవసర యాప్‌లను తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామ సచివాలయ ఉద్యోగులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మండలంలోని 12 గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులందరూ విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ నిత్యం తాము నిర్వర్తించే విధులకు తోడుగా ప్రభుత్వం అనేక సర్వేలు నిర్వహించే బాధ్యతను తమకు అప్పగిస్తుందన్నారు. దీని వలన పనిభారం పెరిగిందన్నారు. ఇటీవల రియల్ గవర్నెన్స్ పేరుతో ప్రజలు వినియోగించుకునే వీలుగా ప్రతి వ్యక్తిని కలవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల వ్యతిరేక వైఖరిని విడనాడకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందనకు సచివాలయ ఉద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు.

వైద్య సేవలపై ఆరా


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న అనురాధ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ గురువారం సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలు, వైద్యసేవల తీరుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను నేరుగా పలకరించి సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రక్త హీనత తగ్గించడానికి రోగులకు అందిచాల్సిన చికిత్సలు వివరించారు. రక్త హీనత విషయంలో మహిళలను, చిన్నారులను అప్రమత్తం చేయాలని సూచించారు. గడువు ముగిసిన మందుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అటువంటివి ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకుని వాడుకలోకి రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా పీహెచ్‌సీ ఆవరణలో మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ లక్ష్మణ్, రాజమహేంద్రవరం డీఎంఓ జ్ఞానశ్రీ, ఎంపీహెచ్‌ఈఓ మోహన్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ కల్యాణి, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రత్నసుధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సామాజిక స్పృహ సమాజానికి మేలు


వెలగతోడులో శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): ఉపాధ్యాయుడు కలిగి ఉన్న సామాజిక స్పృహ మానవ సమాజానికి మేలు చేస్తుందని ఎంఈఓ చింతా వెంకట సోమిరెడ్డి అన్నారు. వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సొంటేని శ్రీనివాసరావు ఇటీవల సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇన్‌స్పిరేషనల్ అవార్డు అందుకున్నారు. ఆ నేపథ్యంలో వెలగతోడు పాఠశాలలో గురువారం హెచ్‌ఎం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఉందుర్తి వీర వెంకటరావు, మండపేట మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి తాడి శ్రీనివాసరావు, ఎస్‌టీయూ నాయకులు చల్లా వీర వెంకట సత్యనారాయణ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నెక్కింటి రమేష్ బాబు, ఉపాధ్యాయులు యేసు రాజు, శ్రీహరి, వీర్రాజు వీరభద్రరావు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలపై సన్నాహక సమావేశం

అంబాజీపేట: స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 2025–26 క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓలు వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట మండల రిసోర్స్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలపై ఎస్‌జీఎఫ్ మండల కో–ఆర్డినేటర్, అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ, ఈనెల 18న బాలురు, 19న బాలికలకు అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగ క్రీడాంశాలలో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా అథ్లెటిక్స్ విభాగాల్లో కూడా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ ఆటల పోటీల్లో మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో ఎంపికైన వారిని డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని ఆదిలక్ష్మి తెలిపారు. హెచ్‌ఎంలు కడలి సాయిరాం, వరప్రసాద్, ఎమ్మెస్సార్ సీహెచ్ మూర్తి, వెంకట కేశవాచార్యులు, పీడీలు అందే సూర్యనారాయణ ముత్యాల కిషోర్, పెచ్చెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. శ్రీసత్య ఆటో మెకానిక్ షెడ్ ఎదురుగా ఉన్న పుంత రోడ్డు సమీపంలో మృతదేహాన్ని పట్టణ వాసులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 50 సంవత్సరాలు వయస్సు ఉండి తెలుపు నలుపు రంగుల డిజైన్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440796591, 8332957936 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ సురేష్ బాబు తెలిపారు.

బోధనేతర పనుల ఒత్తిడి తగ్గించాలి

రాయవరం: ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి తగ్గించాలని యూటీఎఫ్ రాయవరం మండల శాఖ డిమాండ్ చేసింది. మండలంలోని పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురవారం యూటీఎఫ్ రణభేరి పోస్టర్‌ను యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడలి శ్రీనివాస్, గొడితి మురళీకృష్ణల ఆధ్వర్యంలో రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన మూల్యాంకన విధానాన్ని మార్చాలన్నారు. ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీ కమిటీని నియమించాలని, అలాగే వెంటనే ఐ.ఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బైక్ జాతా నిర్వహిస్తున్నారని, ఈ నెల 25న విజయవాడలో రణభేరి పేరుతో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

కె.గంగవరం: సుందరపల్లి గ్రామానికి చెందిన కుంచినపల్లి గనిరాజు(47) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై జానీ భాషా తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గనిరాజు గత కొంత కాలంగా మానసిక స్థితితో బాధపడుతూ అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఇటీవల మందులు వాడడం మానేశాడు. దీంతో గ్రామంలో వ్యవసాయం కూడా సరిగా చేయలేకపోయాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం గడ్డి మందు తాగాడు. అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించి అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జానీ బాషా తెలిపారు.

నేరేడిమిల్లికి ప్రజ్ఞా పురస్కార్ అవార్డు

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నేరేడిమిల్లి సత్యనారాయణ ఉపాధ్యాయ ప్రజ్ఞా పురస్కార్ అవార్డును గురువారం అందుకున్నారు. అమలాపురంలోని బుద్ధవిహార్‌లో ఆంధ్రప్రదేశ్ ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, జిల్లా సౌజన్యంతో త్రిరత్న బుద్ధ విహార్ వేదికగా జరిగిన కార్యక్రమంలో సీనియర్ ధమ్మ బోధకులు, రామ్ బోధికాశి అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షులు డీబీ లోక్ ముఖ్య అతిథులుగా హాజరై ఆయనకు అవార్డును అందజేశారు. ఆయనను ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడి


మారేడుబాకలో అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రభాకర్

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండపేట వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ అన్నారు. మండపేట మండలం మారేడుబాకలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతుల్లోనే ఎరువులను వాడాలని, పురుగు మందులు వినియోగంలో మిత్ర పురుగులు చనిపోకుండా జాగ్రత్త పడాలన్నారు. వరి పంట చిరు పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో కాండం తొలిచే పురుగు ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రాయుడు గంగరాజు, గ్రామ విస్తరణ అధికారి బాలకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ బాజీ, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎంపీపీ వెంకటరమణ తదితరులు

రాయవరం: గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఎంపీపీ నౌడు వెంకటరమణ ప్రారంభించారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా గ్రామంలో లోవోల్టేజి సమస్య తీరి, విద్యుత్ వినియోగదారులకు ఊరట కలుగుతుందని సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏఈ ఎస్.శ్రీనివాసులు, వార్డు సభ్యులు వుండవిల్లి రాంబాబు, లైన్‌మేన్‌లు శ్రీకాంత్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నదానాలు


కూళ్లలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కె.గంగవరం: మండల పరిధిలోని పామర్రు, కూళ్ల, తామరపల్లి, కె.గంగవరం తదితర గ్రామాల్లో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెలంపాలెంలో పొలంబడి


కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మణిదీప్

రామచంద్రపురం రూరల్: వెలంపాలెంలో మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ ఆధ్వర్యంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఆగ్రో ఎకో సిస్టమ్ అనాలిసిస్ గురించి చార్ట్ రూపంలో వివరించారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్, అగ్ని అస్త్ర, దశపర్ని, ఇంగువ కషాయం తయారు చేసి పిచికారీ చేసే విధానాలను రైతులతో చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎ.ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అనేక ప్రయోజనాలు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రభుత్వం అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం మారేడుబాకలో గురువారం సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. మండపేట మండలంలోని 12 గ్రామాల్లో 25,901, పట్టణ పరిధిలో 16,926 మొత్తం 42,827 కార్డులున్నాయన్నారు. పట్టణంలోని సైదులపేటలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

108 వాహనానికి మరమ్మతులు చేపట్టాలి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని 108 వాహనం మరమ్మతులకు గురై సేవలు కుంటుపడుతున్నాయని, వెంటనే వాహనానికి మరమ్మతులు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో అత్యవసర సేవల కోసం వాహనానికి ఫోన్ చేయగా సమీప ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన వాహనాలను పంపిస్తున్నారన్నారు. అత్యవసర సర్వీసుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. ప్రభుత్వ 108 వాహనం ఆలస్యమవుతున్న నేపథ్యంలో బాధితులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న దుస్థితి మండపేట మండలంలో ఉందని కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు పెన్షనర్ల సమావేశం

కపిలేశ్వరపురం: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండపేట శాఖ నెలవారీ సమావేశం 13 మధ్యాహ్నం 3 గంటలకు మండపేట పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవళ్ల సత్యనారాయణ, కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. పెన్షనర్ల డీఏ, డీఆర్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు.

13న పురస్కారాల అందజేత

మామిడికుదురు: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న 2024– 2025వ సంవత్సరంలో ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహరరాజు గురువారం తెలిపారు. మామిడి కుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో శనివారం ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, మొమెంటోలు అందిస్తామన్నారు. ఉపాధ్యాయులను సన్మానిస్తామని చెప్పారు.

బీమా చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు, ద్వారపూడి గ్రామంలో ప్రమాదవశాత్తూ మరణించిన గునాపు రామ్మూర్తి కుటుంబాల సభ్యులకు మంజూరైన బీమా చెక్కులను గురువారం జనసేన నాయకురాలు వేగుళ్ల అనిత చేతుల మీదుగా అందజేశారు. పార్టీ సభ్యత్వం కలిగి, ప్రీమియం చెల్లించిన ఆయా కుటుంబాల సభ్యులకు రూ.5 లక్షలు చొప్పున బీమా చెక్కులను అందజేశారు.

కంటి వైద్యాన్ని మెరుగుపర్చాలి

కపిలేశ్వరపురం (మండపేట): పేద, మధ్య తరగతి ప్రజల కంటి వైద్యాన్ని మెరుగుపర్చాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఐటీ విభాగం కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు డిమాండ్ చేశారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం సామాన్య ప్రజలకు విశేషంగా మేలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా 2024 సెప్టెంబర్ మొదటి వారంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటి పరీక్షా కేంద్రాలను మూసివేసిందన్నారు. ప్రభుత్వ కంటి వైద్య సేవలు సన్నగిల్లడంతో సామాన్యులు ప్రభుత్వాసుపత్రులను ఆశ్రయిస్తున్నారని వెంకన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

వీఆర్వో ఫిర్యాదుపై కేసు

రామచంద్రపురం రూరల్: కాపవరం వీఆర్వో వరదా శ్రీనివాస ప్రసాద్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ గురువారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జుత్తుక ప్రసాద్ ల్యాండ్ సీలింగ్ భూమిలో అక్రమంగా పక్కా భవనం నిర్మిస్తున్నాడని అందిన ఫిర్యాదు మేరకు రామచంద్రపురం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వాసంశెట్టి సత్యదేవ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాస ప్రసాద్ ఈ నెల 8వ తేదీన పిల్లర్లు కూల్చివేశారు. తిరిగి 9న మళ్లీ నిర్మాణాలు చేస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది వెళ్లి ప్రశ్నించారు. దీనికి వారిని ఏమి చేసుకుంటారో చేసుకోండని గ్రామానికి చెందిన జుత్తుక ప్రసాద్, పువ్వల శ్రీను, పోతుల కృష్ణ, యల్లబోయిన నాగు, మేడిశెట్టి శ్రీనివాసు, నరాల సత్యనారాయణ, యనమదల సూర్యనారాయణలను తనను బెదిరించారని వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం రూరల్: వార్షిక మరమ్మతుల కారణంగా మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ద్రాక్షారామ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్రాక్షారామలోని గాంధీ బొమ్మ సెంటర్, పాత ఆంధ్రా బ్యాంకు వీధి, మాగాపు వారి వీధి, సాక్షి వారి వీధి, ముస్లిం కాలనీ, నున్న వారి వీధి, ఆగా వారి వీధులలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.